

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రంగారెడ్డి
శనివారం | డిసెంబర్ 02 2023 | www.navatelangana.com

నెగ్గేదెవరో..!



- ఈవీఎంలో అభ్యర్థుల భవితవ్యం
- రేపే కౌంటింగ్
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఎక్కువ నియోజకవర్గాల్లో ద్విముఖ పోటీ
- ఒకట్రెండు ప్రాంతాల్లో ట్రైయాంగిల్
- ఉమ్మడి రంగారెడ్డిలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ వైపు మొగ్గు
- గెలుపుపై బీఆర్ఎస్ నేతల ధీమా
- ఫలితాల కోసం జిల్లా ప్రజల్లో ఉత్కంఠ
- ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఆందోళన
- గెలుస్తామని ధీమా ఉన్నప్పటికీ.. ఎక్కడో చిన్న ఆందోళన..



2లో...

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం ప్రజల ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు. అభ్యర్థులలో ఉత్కంఠ నెలకొంది. ఈవీఎంలో అభ్యర్థుల భవితవ్యం దాగి ఉంది. గెలుపు ఎవరిని వరిస్తోందో అని అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఎగ్జిట్ పోల్స్ ఇచ్చే ఫలితాలు మాత్రం అభ్యర్థుల గుండెల్లో రైలు పరిగెత్తిస్తున్నాయి. ప్రస్తుత ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు చూపుతున్నాయి. దీంతో బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన మొదలైంది. గ్రౌండ్ రిపోర్ట్ కూడా ఎక్కువ శాతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నాయి. అయితే తామే గెలుస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. చాలా నియోజకవర్గాల్లో పోటాపోటీ ఉండనుండడంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు వేగం వల్లనే ప్రమాదం
- పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తుండగా ఘటన

నవతెలంగాణ-శంషాబాద్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం లాలాపేటకు చెందిన బొట్టు అభిషేక్ (30) ప్రయివేట్ జాబ్ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను పటాన్ చెరువుకు చెందిన ఇతని స్నేహితుడు అజయ్ (28)తో కలిసి గురువారం షాద్‌నగర్‌లో స్నేహితుని పుట్టినరోజు వేడుకలకు వెళ్తున్నామని మధ్యాహ్నం బయలుదేరారు. అక్కడే ఉండి మరుసటి రోజు తెల్లవారుజామున స్వస్థలానికి బయలుదేరారు. మండల పరిధిలోని తొండుపల్లిలో జాతీయ రహదారి-44పై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి వద్దకు రాగానే ద్విచక్ర వాహనంను అతివేగంగా అభిషేక్ డ్రైవింగ్ చేశాడు. దీంతో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద ఉన్న మట్టి కుప్పను కొట్టడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం వెనుకాల కూర్చున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని శంషాబాద్‌లోని ఆర్గాన్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అతిజాగ్రత్తగా, అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

తగ్గిన పోలింగ్ శాతం

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం గతంతో పోల్చితే ఒకట్రెండు శాతం తగ్గింది. పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల అధికారులు ఓటర్లుకు అవగాహన కల్పించినా అర్బన్ ప్రాంత ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఓటింగ్ శాతం తగ్గడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అని ఆందోళన చెందుతున్నారు.

4లో...

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

- అర్బన్‌లో ఓటింగ్‌కు విముఖత
- ఓటు హక్కును వినియోగించుకున్న గ్రామీణ ప్రజలు
- గతంతో పోల్చితే రంగారెడ్డిలో 2 శాతం, వికారాబాద్‌లో ఒక శాతం తగ్గుదల
- ఓటింగ్ తగ్గడంతో అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల మెడికల్ సూపరిండెంట్ డా.రామకృష్ణారెడ్డి
- మెడికల్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం
- ఎయిడ్స్‌పై అవగాహన

8లో...

కార్యకర్తలకు అండగా ఉంటా

- చేయూతనిచ్చినందుకు చేతులెత్తి మొక్కిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్
- కార్యకర్తలతో రుణపడి ఉంటా
- నాయకులు, కార్యకర్తలతో సమావేశం

8లో...

అధికార మార్పు కోరుకుంటున్న ప్రజలు

- న్యాయవాది గూడెపు రాజేందర్
- ఎగ్జిట్ పోల్స్ అంచనా రుజు

నవతెలంగాణ-శంషాబాద్



తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు అధికారాన్ని చేపట్టిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తూ అధికార మార్పును కోరుకుంటున్నట్టుగా స్పష్టమవుతుంది అని న్యాయవాది గూడెపు రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆయన శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామంలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం ఆవిర్భవించిన తర్వాత ఏ ప్రభుత్వం కూడా మూడోసారి అధికారంలోకి రాలేదని అన్నారు. అదే ఆనవాయితీ తెలంగాణలో కూడా పునరావృతం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ఉద్యమం సాగి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిం దన్నారు. రెండు దఫాలుగా ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు అయితే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన జరగలేదన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. గురువారం జరిగిన ఎన్నికలు అనంతరం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పరిపాలన కాకుండా వ్యక్తిగత ఎజెండాతో పరిపాలన చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం జరుగుతుందన్నారు. వచ్చే ప్రభుత్వంలోనైనా అధికారం చేపట్టేవారు ప్రజా రంజకమైన పరిపాలన చేపట్టాలని ఆకాంక్షించారు.

నెగ్గేదెవరో..!

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏ పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ సీట్లు వచ్చే అవకాశం కనిపించడం లేదు. గెలిచే అభ్యర్థులు సైతం పెద్దగా మెజార్టీ వచ్చే అవకాశాలు లేవు. ఎక్కువ స్థానాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ ఉండనుంది. ఒకట్రెండు ప్రాంతాల్లో ట్రైయాంగిల్ ఉండనుంది.

అయితే జిల్లాలో ప్రధానంగా మహేశ్వరం నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. మొదట్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటాపోటీగా ఉన్నప్పటికీ.. పోలింగ్ సమయం అనూహ్యంగా బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగినట్టు తెలుస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో బీజేపీకి కూడా అవకాశం లేకపోలేదని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఉన్నప్పటికీ.. స్వల్ప మెజార్టీలో కాంగ్రెస్ గట్టెక్కె పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోంది.

రాజేందర్నగర్లో సిట్టింగ్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అయినప్పటికీ.. ప్రస్తుతం ఇక్కడ బీజేపీ గట్టి పోటీనిచ్చింది. బీఆర్ఎస్, బీజేపీల మధ్య స్వల్ప తేడా ఉండనుంది. బీజేపీకి కొంత అనుకూలత ఉన్నప్పటికీ బీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

శేరిలింగంపల్లి కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ ఉంటుందని భావించినప్పటికీ.. అక్కడ అనూహ్యంగా మార్పులు చోటు చేసుకున్నాయి. బీజేపీ అభ్యర్థి స్థానికంగా వ్యక్తి బలంతో కొంత ఓటింగ్ శాతం పెంచుకున్నాడు. దీంతో బీఆర్ఎస్ గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ స్వల్ప మెజార్టీ భయటపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

చేవెళ్ల , షాద్నగర్లో నియోజకవర్గంలో పోలింగ్ రోజు వరకు కాంగ్రెస్కు మంచి అవకాశాలు ఉన్నప్పటికీ.. పోలింగ్ సమయంలో ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గట్టిపోటీ ఉండనున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యహోరాహోరీగా ఉండనున్నట్టు తెలుస్తోంది.

కల్వకుర్తిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య గెలుపోటములు ఉండనున్నాయి. ఎక్కువ అవకాశాలు కాంగ్రెస్కు ఉన్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ ఇక్కడ వెనకబాటులో ఉన్నట్టు తెలుస్తోంది.

వికారాబాద్ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్కు మెరుగైన అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించనున్నట్టు తెలుస్తోంది. తాండూ రులో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ ఉంది. ఇక్కడ ఏ పార్టీ బయట పడ్డా స్వల్ప మెజార్టీతో బయటపడే అవకాశం ఉంది. పరిగిలో బీఆర్ఎస్కు ఎక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ అనుహ్యంగా పోలింగ్ సమయానికి ఓటింగ్ కాంగ్రెస్ వైపు మళ్లింది. దీంతో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

కొండగల్లో టీపీసీసీ రేవంత్రెడ్డికి బీఆర్ఎస్కు మధ్య గట్టిపోటీ ఉంది. అయితే మొదట్లో కాంగ్రెస్కు మంచి అవకాశాలు ఉన్నప్పటికీ.. పోలింగ్ సమయంలో ఓటర్లు బీఆర్ఎస్కు మళ్లినట్టు తెలుస్తోంది. దీంతో ఇక్కడ కాంగ్రెస్.. బీఆర్ఎస్ మధ్య పోటాపోటీ ఉండనున్నట్టు ప్రస్తుత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తెలుపుతున్నాయి.

జిల్లాలో కాంగ్రెస్కు మొగ్గు..

ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల్లో ఎక్కువ సీట్లు కాంగ్రెస్కు వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రస్తుత ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్నాయి. వికారాబాద్లో మూడు లేదా నాలుగు సీట్లు వచ్చే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లాలో కల్వకుర్తి, ఎల్బీనగర్, ఇబ్రహీం పట్నం, చేవెళ్లలో కాంగ్రెస్కు మెరుగైన అవకా శాలు ఉన్నాయి. రాజేందర్నగర్, శేరిలింగంపల్లి, షాద్నగర్, తాండూరులో బీఆర్ఎస్కు అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోనున్నట్టు తెలుస్తోంది.

నిలిపి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీ కొట్టిన టెంపో

నవతెలంగాణ-శంషాబాద్

నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి టెంపో ఢీ కొట్టిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసి డ్రైవర్ తెల్లవారు జామున 4 గంటలకు కేశంపేట మండలం నుంచి డ్రైవింగ్ చేసుకుంటూ శంషాబాద్ వైపు వస్తున్నారు. ఐదు గంటల పది నిమిషాల సమయంలో మండల పరిధిలోని పెద్ద షాపూర్ నేషనల్ హైవేపై బస్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కిస్తుండగా వెనుక నుంచి టెంపో వ్యాన్ వేగంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుక సీట్ లో కూర్చున్న వ్యక్తికి గాయాలైనవి. బస్సు కూడా ధ్వంసం అయింది. దీంతో బస్సు డ్రైవర్ ఎండి నిరంజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు. టెంపోలో ఉన్న ముగ్గురు ప్యాసింజర్లకు కూడా గాయాలయ్యాయి.

చేవెళ్లలో 74.18శాతం ఓట్లు నమోదు



నవతెలంగాణ-చేవెళ్ల

చేవెళ్ల అసెంబ్లీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 74.18 శాతం ఓట్లు పోలయ్యాయి. అయితే చేవెళ్ల నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 62 వేల 005 మంది ఓటర్లు ఉన్నారు. అయితే మొత్తం లక్ష 93వేల 408 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మహిళ 94వేల 222 ఓట్లు పోలయ్యా యి. అలాగే పురుషులు 99వేల 186 ఓట్లు పోలయ్యాయి. అయితే పోలింగ్ మాత్రం 74.18 పోలింగ్ శాతం నమోదు అయ్యిందని అధికారులు వెల్లడించారు. చేవెళ్ల మండలంలో మొత్తం 74.13 పోలింగ్ శాతం నమోదు అయ్యింది. శంకర్పల్లి మండలంలో 72.95 శాతం పోలింగ్ శాతం నమోదు అయ్యింది. మొయినాబాద్ మండలంలో మొత్తం 75.81శాతం నమోదు అయ్యింది. నవాబ్పేట్ మండలంలో మొత్తం 73.88 శాతం నమోదు అయ్యింది. షాబాద్ మండలంలో మొత్తం 72.13 శాతం నమోదు అయ్యిందని ఎన్నికల అధికారులు తెలిపారు. అయితే అత్యధికంగా నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో పోలింగ్ శాతం నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. ఈనెల 3వ తేదీన రాజేంద్రనగర్లోని లార్డ్స్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతంలో 2018 పోలింగ్ పర్సెంటేజ్ 78.69 నమోదయింది.

కౌంటింగ్కు అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రేపు జరిగే ఎన్నికల కౌంటింగ్కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు శేరిలింగంపల్లి ఎన్నికల అధికారులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రేపు ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలవుతుందని, 8.30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామని వారు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది. నియోజకవర్గంలో 7లక్షల 32వేల 506 మంది ఓటర్లకు గాను 3లక్షల 57వేల 074 ఓట్లు పోలైనట్టు తెలిపారు. వీటి లెక్కింపు ఆదివారం లెక్కిస్తామన్నారు. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే ఈవీఎంల అన్ని లెక్కింపు సెంటర్కు తరలించినట్టు తెలిపారు. స్టేడియం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

- ఓటింగ్ శాతం తగ్గడం పట్ల
- ఎవరికీ లాభమో ఎవరికీ నష్టమో?
- ముందుకు రాని నార్త్ ఇండియన్ ఓటర్లు

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

ప్రజల్లో చైతన్యం వచ్చింది భారీగా ఓటింగ్ శాతం పెరుగుతుందని అందరూ ఊహించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కనీసం 50 శాతం ఓటర్లు కూడా ఓట్లు వేయకపోవడం ఆందోలన కల్గిస్తోంది. ఓట్ల శాతం తగ్గడంతో అభ్యర్థుల్లో కలవరం మొదలైంది. ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటింగ్ బాగా తగ్గింది. కనీసం 50శాతం కూడా ఓటింగ్ నమోదు కాలేదు. నార్త్ ఇండియన్ ఓటర్లను నమ్ముకున్న బీజేపీకి తీవ్ర నిరాశ ఎదురయిందని ఆ పార్టీ వారు తెలిపారు. స్లమ్ ఏరియాలో ఎక్కువగా ఓట్లు పోలయ్యాయి. దీంతో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందనేది అంతు చిక్కడం లేదు. దాంతో అందరిలోనూ ఉత్కంట నెలకొంది. అయితే ఈ నెల 3న ఓట్ల లెక్కింపు ఉంది. ఆదివారం ఎవరి భవిష్యత్ ఏమిటో తేలిపోనుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఆదిభట్ల

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఆదిభట్ల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం బానోత్ దుర్గా ప్రసాద్(17) ఇంటర్ చదువుతున్నాడు. అతను ఉదయం 11 గంటల సమయంలో మంగల్పల్లి నుంచి కొంగర కలాన్ వస్తుండగా టాటా ఏస్ ఆటో ఓవర్ టెక్ చేస్తూ కుడి వైపు నుంచి వస్తున్న దుర్గాప్రసాద్ బైక్ను ఢీకొట్టింది. ఈ ఘటనలో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ కోమాలోకి వెళ్లినట్టు వైద్యులు తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.



గండిగూడ హైవే వద్ద లారీ బోల్తా

- డ్రైవర్పై కేసు నమోదు

నవతెలంగాణ-శంషాబాద్

లోడుతో ఉన్న లారీ బోల్తా పడిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం స్టీల్ రాడ్ లోడ్తో వస్తున్న లారీ అదుపుతప్పి మండల పరిధిలోని గండిగూడ నేషనల్ హైవేపై పడిపోయింది. విషయం తెలుసుకున్న పెట్రోలింగ్ ట్రాఫిక్ కానిస్టేబుల్ చాకలి నర్సింగ్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అక్కడ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగినట్టు గుర్తించారు. అందులో ఉన్న స్టీల్ రాడ్లు ఇతర వాహనదారులకు గుచ్చుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. డ్రైవర్పై కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు


- కాంగ్రెస్ తలకొండపల్లి మండలాధ్యక్షులు డోకూర్ ప్రభాకర్రెడ్డి

నవతెలంగాణ-తలకొండపల్లి



కాంగ్రెస్ గెలుపొందిన వెంటనే ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ తలకొండపల్లి మండలాధ్యక్షులు డోకూర్ ప్రభాకర్రెడ్డి తెలిపారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రామికులుగా పనిచేసిన డీసీసీ నాయకులకు అభిమానులు, కార్యకర్తలు, సీనియర్ కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ మైనార్టీ ఎస్సీ సెల్ కిసాన్ సెల్ బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ , ఎన్ఎస్యుఐ ముఖ్య నాయకులు, అన్ని గ్రామాల సర్పంచులకు ఎంపీటీసీలకు మాజీ సర్పంచ్ మాజీ డిప్యూటీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ కోసం కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-తలకొండపల్లి

మండల కేంద్రంలో ఉన్న 32 గ్రామపంచాయతీలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పార్టీ కోసం కష్టపడిన పనిచేసిన వారికి బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ రూములో భద్రపరిచిన ఈవీఎంలు





నవతెలంగాణ-పరిగి

శాసనసభ ఎన్నికల సందర్భంగా గురువారం నిర్వహించిన పోలింగ్ సంబంధించిన ఈవీఎంలను శుక్రవారం పరిగి పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్‌లోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. పరిగి మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్క్రూటీని నిర్వహించి స్ట్రాంగ్ రూములలో భద్రపరిచి సీల్ వేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి నారాయణ రెడ్డి, సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాష్, సుధాకర్ జయ్లాక్షోలతో పాటు నాలుగు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, విజయ కుమారి, శ్రీనివాసరావు, సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులున్నారు.

భూ తగదాల్లో దయాదుల మధ్య ఘర్షణ

- రక్త సంబందం మరిచి అన్నదమ్ములు ఒకరికి పై ఒకరు దాడి చేసుకున్న వైనం

నవతెలంగాణ-దోమ

భూ తగదాల విషయాల్లో దయాదుల మధ్య దాడిలో పలువురికి రక్త గాయాలైన ఘటన మండల పరిధిలోని బుదులపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మోతే నర్సింలు, హరి శంకర్, శ్రీనులు అన్నదమ్ములు కొన్నేండ్ల నుంచి వీరి మధ్య భూతగాదాలు కొనసాగు తున్నాయి. గురువారం నర్సింలు, శ్రీనులు, హరిశంకర్ కుమారుడు బాబుతో గొడవపడ్డారు. విషయాన్ని దృష్టిలో పెట్టుకుని శుక్రవారం హరిశంకర్, బాబు వారి బంధువులతో కలిసి ఇనుపరాడ్లు,



కర్రలతో నరసింహులు, భార్య లాలమ్మ, శ్రీనుపై దాడి చేయడంతో రక్త గాయాలయ్యాయి. విషయంపై గ్రామస్తులు అంబులెన్సుకు ఫోన్ చేయడంతో చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ



ఆస్పత్రికి తరలించారు. విషయంపై దోమ ఎస్సై రవిగౌడ్‌ను వివరణ కోరగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కాంగ్రెస్‌దే విజయం



- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- ఎన్నికల సరళి పై సమీక్ష

నవతెలంగాణ పరిగి

కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది అని రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టి రామ్మోహన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల సరళి పై సమీక్షించారు. కచ్చితంగా 3వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది అని రేవంత్ రెడ్డి తెలిపారని అన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళి

నవతెలంగాణ-మేడ్చల్

తెలంగాణ మలిదశ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య 14వ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ నీరుడి రఘు,యూత్ అధ్యక్షుడు మర్కంటీ నాగరాజు, యూత్ ఉపాధ్యక్షులు జీ.పరమేష్, నీరుడి శ్రీరామ్‌లు కానిస్టేబుల్ కిష్టయ్యకు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి ట్యాంకుబండ్ పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కిష్టయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అమరుల ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు శ్రీకాంత్, మర్రి చెట్టు శ్రీను, ప్రసాద్, పోచయ్య, వెంకట్ లచ్చు నర్సింహ, బండమీది నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

ష్ .. గప్ చుప్

ఓట్ల ముచ్చట్లు



ఈవీయం గుప్పిట్లో
నిక్షిప్తమైన నాయకుల
భవితవ్యం..
సర్వత్రా ఉత్కంఠతతో
నిశ్శబ్ద యుద్ధ వాతావరణం...

మొన్నటిదాకా పేల్చిన
మాటల తూటాలు
ఎవరిని గాయపరిచిందో...
ఓటర్ల దయాదాక్షిణ్యాలు
ఏ నాయకుడిని
అందల మెక్కిస్తుందోననీ...
ఫలితాలకై ఎదురుచూసే
విద్యార్థుల్లా
నాయకమణుల నిరీక్షణం.

శత్రువులు మిత్రులుగా
మిత్రులు శత్రువులు గా మారి
దూషణ భూషణాలతో
కౌగిలిం చుకుంటూ...
ఓటర్లకు గాలమేశామనీ
మా గాలానికి చిక్కిందెవరో
మమ్ములనే ఆ ..
గాలానికి ఎరగా
వేసిందెవరోననీ ..
కాలుగాలిన పిల్లుల్లా
కలవరపడుతున్న వైనం ..

అమ్మా !నీ కాల్మొక్త
అయ్యా !నీ బాంచన్
మీ ఓటు నాకెయ్యమని
కనపడిన వారినల్లా
కాళ్లావేళ్లా పడ్డామని ..
ఏ అమ్మ కనికరించిందో
ఏ అయ్య కసిరి కొట్టిందోననీ
మనసంతా హై ఓల్టేజ్
టెన్షన్ మయం ...

ఓటరు నాడి పసిగట్టామని
కొందరు..
మాటల గారడీతో బురిడీ
కొట్టించామని మరికొందరు
ఎవరికి వారు గెలుపు ధీమాతో
మేకపోతు గాంభీర్యాన్ని
ప్రదర్శిస్తున్న చందమే...

ఆకాశాన్ని నేలకు
దించుతామని ..నేలను
ఆకాశంలా తీర్చిదిద్దుతామనీ ..
వాగ్దాన పరంపరతో
ఓటర్ల కటాక్షానికై
అర్రులు చాచామనీ..
పాలముంచారో..
ఓటర్లు నీటముంచారోననీ
క్షణక్షణం దిగులుపడుతున్న
దైన్యం ...

మీ చూపంతా మావైపు
మా మనసంతా ప్రజాస్వామ్యం
వైపనీ ..
నిండుగర్భిణీగా
ప్రస్తుతం తామున్నామనీ ..
ప్రసవ వేదన పడుతున్నామనీ
ప్రజాభీష్ట విజేతలను
ప్రసవించేరోజు మూడో తేదీననీ...

అంతవరకు అందరూ
" ష్ ..గప్ చుప్' గా ఉండాలనీ
నింపాదిగా సెలవిచ్చాయి
ఈవీఎంలు... నిజాయితీగా...

- బాదేపల్లి వెంకటయ్యగౌడ్
9948508939.

తగ్గిన పోలింగ్ శాతం

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం గతంతో పోల్చితే ఒకట్రెండు శాతం తగ్గింది. పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల అధికారులు ఓటర్లుకు అవగాహన కల్పించినా అర్బన్ ప్రాంత ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఓటింగ్ శాతం తగ్గడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అని ఆందోళన చెందుతున్నారు.

నవతెలంగాణ-రంగారెడ్డి
ప్రాంతీయ ప్రతినిధి

- అర్బన్‌లో ఓటింగ్‌కు విముఖత
- ఓటు హక్కును వినియోగించుకున్న గ్రామీణ ప్రజలు
- గతంతో పోల్చితే రంగారెడ్డిలో 2 శాతం, వికారాబాద్‌లో ఒక శాతం తగ్గుదల
- ఓటింగ్ తగ్గడంతో అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఓటింగ్ శాతం తగ్గింది. 2018 ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో 62 శాతం నమోదు కాగా, 2023 ఎన్నికల్లో 59.94 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. వికారాబాద్ జిల్లాలో గత ఎన్నికల్లో 77.89 శాతం ఓట్లు పోల్ కాగా.. ప్రస్తుతం 76.99 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. దీనిని బట్టి చూస్తూ రంగారెడ్డిలో 2 శాతం ఓటింగ్ తగ్గగా.. వికారాబాద్‌లో ఒక శాతం ఓటింగ్ తగ్గింది. రంగారెడ్డి జిల్లాలో అత్యల్పంగా శేరిలింగంపల్లిలో 48.75 ఓటింగ్ శాతం నమోదు కాగా.. అత్యధికంగా కల్వకుర్తిలో 83.26 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. అయితే అర్బన్ ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవడంలో నిర్లక్ష్యం చేసినట్టు స్పష్టమవుతుంది.

ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ ముందు నుంచి ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అవగాహనా సదసులు నిర్వహించారు. ప్రకటనల రూపంలో ఓటర్లకు ఓటు ప్రాధాన్యత వివరించారు. కానీ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడం లో ఆసక్తి చూపలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు 80 శాతం వరకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలపై గ్రామీణ ప్రాంత ప్రజలల్లో ఉన్న చైతన్యం.. అర్బన్ ప్రాంత ప్రజలకు లేకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



రంగారెడ్డిలో పోలింగ్ శాతం వివరాలు :

నియోజకవర్గం	పోలింగ్ శాతం
ఇబ్రహీంపట్నం	74.93
ఎల్‌బీనగర్	49.07
మహేశ్వరం	55.39
రాజేందర్ నగర్	55.83
శేరిలింగంపల్లి	48.75
చేవెళ్ల	74.18
కల్వకుర్తి	83.26
షాద్‌నగర్	82.09
మొత్తం	59.99

వికారాబాద్‌లో పోలింగ్ శాతం వివరాలు :

నియోజకవర్గం	పోలింగ్ శాతం
వికారాబాద్	75.57
పరిగి	76.70
తాండూరు	73.71
కొండంగల్	81.96
మొత్తం	76.99

శేరిలింగంపల్లిలో నియోజకవర్గంలో 48.85 శాతం పోలింగ్

- ఓటు వేసేందుకు ఆసక్తి చూపని ప్రజలు
- 50శాతం కూడా దాటని పోలింగ్
- ఉదయం వేగంగా పోలింగ్
- సాయంత్రానికి మందగింపు
- ఓటింగ్ శాతం తగ్గడంతో అభ్యర్థుల్లో ఆందోళన

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 48.85 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. అయితే 50శాతం కంటే తక్కువగా ఓటింగ్ నమోదు కావడం ఆందోళన కల్గిస్తుంది. రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గం అయినప్పటికీ ఓటర్లు మాత్రం ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. ఓటింగ్ శాతం తగ్గడంతో ఫలితాలపై అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

పోలింగ్ సరళి :

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 7లక్షల 32వేల 506 మంది ఓటర్లకు గాను 3లక్షల 57వేల 074 ఓట్లు పోలైనట్టు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 48.85 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 9 గంటల వరకు 8 శాతం, 11 గంటల వరకు 21.05 శాతం, మధ్యాహ్నం 1 వరకు 28.03 శాతం, 3 వరకు 31.0శాతం, 3.30 వరకు 38.35 శాతం.. మొత్తం 48.85 శాతం ఓటింగ్ నమోదయింది. ఉదయం కొంత వేగంగా ఓటింగ్ జరిగినప్పటికీ సాయంత్రానికి పూర్తిగా తగ్గింది. గతంలో కూడా ఇక్కడ తక్కువగా పోలింగ్ నమోదైంది. ఈసారి పెరుగుతుందని అందరూ భావించారు. కానీ ఈసారి కూడా పోలింగ్ పెరగలేదు. కనీసం 50శాతం అయిన పోలింగ్ జరుగుతుందని అందరూ భావించారు. కానీ ఆ స్థాయిలో పోలింగ్ జరగలేదు. ఈ నియోజకవర్గంలో పట్టణ ప్రాంతం కావడంతో ఓటింగ్ శాతం తగ్గిందని అందరూ భావిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఆందోళన

ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే. గెలుపోములను ఒక్క ఓటు కూడా నిర్ణయించే పరిస్థితులు ఉంటాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటింగ్ శాతం తగ్గడంతో అభ్యర్థులు ఆందోళన చెందు తున్నారు. ఇది ఎవరికి ప్లేస్ అవుతుంది.. ఎవరికి మైనస్ అవుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. బూత్‌ల వారీగా వివరాలు సేకరించి, తమకు పడ్డ ఓట్లపై లెక్కలు కడుతున్నారు. గెలిచే అవకాశాలు ఉన్నాయా.. లేవా.. ఉంటే ఎంత మెజార్టీ వస్తుందో.. అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఏదిఏమైనా అభ్యర్థుల మధ్య పోటాపోటీ ఉండడంతో ఆందోళన చెందుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వికారాబాద్
శనివారం | డిసెంబర్ 02 2023 | www.navatelangana.com

హస్తం గుర్తుకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



కాంగ్రెస్ నాయకులు జేనిగ వెంకటేష్

నవతెలంగాణ-మంచాల

గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జేనిగ వెంకటేశ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 23 గ్రామ పంచాయితీల్లో 45 పోలింగ్‌లో హస్తం గుర్తుకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు కాంగ్రెస్ తరపున కృతజ్ఞతలను తెలిపారు.

పైకి ధీమా లోపల ఆందోళన

- నేతలతో అంచనా వేసుకుంటున్న అభ్యర్థులు
- పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభం
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- మండలాలలోని బూత్‌ల వారీగా పోలింగ్ సరళిపై ఆరా
- పోటీ ముగ్గురు మధ్యే
- మేమంటే మేము గెలుస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శన
- రేపు వెలువడే ఫలితాలకోసం ఎదురుచూపు



నవతెలంగాణ-పరిగి

గురువారం అత్యంత ఉత్కంఠంగా కొనసాగిన పరిగి అసెంబ్లీ స్టెట్మెంట్ సంబంధించిన పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు దీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుని పోలింగ్ సరళీపై చర్చించారు. మండలాలలోని బూత్ల వారీగా పోలింగ్ సరళీపై ఆరా తీస్తున్నారు. గ్రామాల్లో పోలైన ఓట్లను బట్టి కార్యకర్తలతో కలిసి ఎంత మేరకు వస్తాయెూ అంచనా వేసుకుంటున్నారు. భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. లోలోన గుబులు చెలరేగుతున్నా పైకి మాత్రం మేమంటే మేము గెలుస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వత్రా ఉత్కంఠ రేకెత్తుస్తుంటే మరోవైపు నాయకుల్లో ఆందోళన మొదలైంది. 2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ పర్సెంటేజ్ పెరిగింది. ఈ ఓట్లు ఎవరికి పడ్డాయెూ తెలియక నాయకులలో ఆందోళన మొదలైంది.

పెరిగిన ఓటింగ్

గురువారం జరిగిన పోలింగ్‌లో పరిగి నియెూజకవర్గంలో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం పెరిగింది. 2018 ఎన్నికల్లో 2,29,285 ఓటర్లగాను 1,73,416 ఓట్లు పోలయ్యాయి. దీనితో 75.63 శాతం ఓటింగ్ నమోదయింది. గడచిన 5 ఏండ్లలో 30,137 ఓట్లు పెరిగాయి. ప్రస్తుతం 2,59,422 ఓట్లగాను 1,98,986 ఓట్లు పోలయ్యాయి. 76.70 శాతం ఓటింగ్ నమోదయింది. 2018 కంటే ఈసారి 25,570 ఓట్లు అధికంగా పోలేయ్యాయి. ఈ పెరిగిన ఓట్లు ఎవరికి పడ్డాయెూ తెలియక అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. తమ కార్యకర్తలను పిలిపించుకొని పెరిగిన ఓట్లు ఎవరికీ లభిస్తాయెూ అంచనా వేసుకుంటున్నారు.

పోటీ ముగ్గురు మధ్యే

పరిగి నియెూజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. ఈ పోటీ హెూరాహెూరీగా జరిగినట్టు స్పష్టమైంది. అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా తీవ్రంగా శ్రమించారు. దీని ఫలితంగా ఓటింగ్ కూడా ఓటింగ్ శాతం కూడా పెరిగింది. పెరిగిన ఓటింగ్ మాకు పడిందంటే మాకు పడిందని చెప్పుకుంటున్నారు. కానీ అభ్యర్థులు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నారు లోలోపట మాత్రం ఆందోళన మొదలైంది.

మండలాల వారీగా అంచనా

ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు తమకు వచ్చిన ఓట్లపై లెక్కలు కడుతున్నారు. పోలింగ్‌సరళి, పోలైన ఓట్ల వివరాలపై నాయకులను మండలాల వారీగా అడిగి తెలుసుకుంటున్నారు. బూతుల వారీగా తమకు వచ్చే ఓట్లు ఎన్ని, పోయే ఓట్లెన్ని అంటూ కూడికలు తీసివేతలు చేస్తున్నారు. పెరిగిన ఓటింగ్ తమకు అనుకూలమా వ్యతిరేకమా అని ఆరా తీస్తున్నారు.

భయం భయంగా

గెలుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ధీమా వ్యక్తం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఆయా పార్టీల అభ్యర్థులు, నేతలకు లోలోపల ఓటమి భయం వెంటాడుతుంది. తప్పకుండా గెలుస్తామని ఎవరికీ వారు అంచనాలు వేసుకుంటున్నప్పటికీ లోలోపట ఆందోళన చెందుతున్నారు. తమ అంచనాలు నిజమైతే పదివేల మెజార్టీ ఖాయమని చెప్పుకుంటున్నప్పటికీ, కనీసం 2,000 మెజార్టీతో బయట పడితే చాలు అని నేతలు ధీమాగా ఉన్నారు. రైతులు, ఆసరా పింఛన్ లబ్దిదారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ వెంట ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, నిరుద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నవారు తమ వైపు ఉన్నారని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. బీజేపీ సైతం యువత, బీజేపీ సానుభూతిపరులు, ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు తమవైపు ఉన్నారని చెప్పుకుంటున్నారు. ఇలా ఎవరి అంచనాలు వారికి ఉన్నప్పటికీ లోలోపట మాత్రం మదన పడుతున్నారు.

ఈవీఎంలలో అభ్యర్థుల భవిష్యత్తు

ఓటర్ల తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. ఓటింగ్ తీరుపైనే అభ్యర్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఓటర్లు తమ ఓటు ద్వారా అభిప్రాయాన్ని తెలిపారు. ఓటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గెలుపుపై అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఈ నెల 3న వెలువడే ఫలితాలకోసం వేచి చూడాల్సిందే.







చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

- గుండాల్ గ్రామంలో ఘటన



నవతెలంగాణ-దోమ

చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన చిన్నమల్లి లక్ష్మయ్య (46) గ్రామ సమీపంలో ఉన్న ఓ బావిలోకి గురువారం రాత్రి చేపల వేటకు వెళ్లి కాళ్లకు వల చుట్టుకుని మృతి చెందాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడి కుమారుడు చందు ఫిర్యాదు మేరకు దోమ ఎస్సై రవిగౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య



- లింగన్‌పల్లి గ్రామంలో ఘటన



నవతెలంగాణ-దోమ

తాగిన మైకంలో బావిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నా ఘటన మండల పరిధిలోని లింగన్ పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన మైస నరేష్ (27) గురువారం తాగిన మైకంలో గ్రామ సమీపంలో ఉన్న బావి దగ్గర బట్టలు, చెప్పులు వదిలి బావిలోకి దూకడంతో చెట్ల మధ్యలో ఇరుక్కుపోయాడు. శుక్రవారం మృతుడు నరేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బట్టలు, చెప్పులు చూసి బావిలో దూకి ఉంటాడని అనుమానం రావడంతో మోటార్లతో బావిలో నుండి నీటిని తోడి వేసి మృతదేహన్ని బయటికి తీశారు. మృతి చెందడానికి కాంణం కొన్ని సంవత్సరాల క్రితమే భార్య ని వదిలిపెట్టాడని మనస్థాపానికి లోనై తాగిన మైకంలోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు. విషయంపై దోమ ఎస్‌ఐ రవిగౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు.





అంతు చిక్కని ఓటర్ల నాడి

- అయోమయంలో నాయకులు
- గెలుపుపై పార్టీల మేకపోతు గాంభీర్యం



నవతెలంగాణ-మర్పల్లి

అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని సుమారు 50 రోజులుగా గ్రామాల్లో పలకరింపుల పర్వం కొనసాగింది. రోజులు దగ్గర పడ్డ కొద్ది నాయకుల పలకరింపులు బుజ్జగింపులు మర్యాదలు ఒకరికి మించి ఒకరు పార్టీల తరఫున కొనసాగించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్నీ పథకాలు అందిస్తామని బీఆర్ఎస్ నాయకులు 10 ఏళ్లుగా తెలంగాణ అభివృద్ధిలో కుంటూ పడింది హామీల అమల్లో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైంది కుటుంబ నియంత పాలన కొనసాగిస్తున్నారంటూ అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలకు నమ్మబలికారు. ఏ పార్టీ నాయకులు వచ్చి ఏది చెప్పినా ప్రజలు ఎవరినీ కాదనక అందరి మాటలు విన్నారు. ఏ పార్టీ తరఫున మీటింగ్‌లు పెట్టినా అన్ని పార్టీల మీటింగ్‌లనూ ప్రజలు ఎవరిని నారాజు చేయకుండా విజయవంతం చేశారు. నమ్మకం కుదరని పార్టీల నాయకులు నయానా భయానా ఇచ్చి మర్యాద చేసి కొన్ని రోజులు ప్రచారంలో వెంట తిప్పుకున్నారు. సమయం పూర్తిగా సమీపించడంతో రోజురోజుకూ నాయకుల్లో ప్రజల మనసు అర్థం కాక టెన్షన్ మొదలైంది. ఎవరికి ఎలా ఏమి చేయాలో అది చేస్తూ తమ వాడు అనిపించుకునే ప్రయత్నాలు కొనసాగాయి. సొంత కుటుంబ సభ్యులు సైతం ఇరు వర్గాల పార్టీల వైపు చేరి ఆయా పార్టీల నాయకులకు మనో బలం చేకూర్చారు. కుటుంబ సభ్యులు,స్నేహితులు, బంధువులు సైతం విడిపోయినట్లు నటించి పార్టీల ప్రచారంలో పాల్గొన్నారు. గతంలో గ్రామాలు, కుల, సంఘాలు, యువజన సంఘాలు, బస్తీలు, వార్డులు నిస్వార్థంగా పనిచేసే నాయకుని మాటకు కట్టుబడి పార్టీని అంటూ పెట్టుకుని ఉండేవారు దీంతో గెలుపుపై నాయకుల అంచనాలు కొంతమేర సర్వే ఫలితాలు ఫలించేయి. కానీ నేడు తమ స్వార్థం కోసం పూటకో పార్టీ మారుతూ ప్రజల నమ్మకాన్ని పొందలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో సర్వేల ఫలితాలపై అయోమయం నెలకొంది. ప్రజల నాడి ఎవరికి అర్థం కాక మేము గెలుస్తామంటే మేము గెలుస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ నాయకులు అయోమయానికి గురవుతు టెన్షన్‌లో ఉన్నారంటున్నారు కొందరు. 30 తేదిన పోలింగ్ ముగిసింది.

వాసన్ ఐ కేర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చందానగర్‌లో ప్రారంభం



నవతెలంగాణ-చందానగర్

దేశంలోని ప్రముఖ కంటి ఆస్పత్రి వాసన్ ఐ కేర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి శాఖను చందానగర్ లో ప్రారంభించింది. డైరెక్టర్ డా.వికాస్ జైన్ మాట్లాడుతూ..వాసన్ఐకేర్ ద్వారా ప్రపంచంలోని అత్యుత్తమ నేత్ర వైద్య సదుపాయాలు సామాన్యులకు అందుబాటులో తీసుకువచ్చామన్నారు. అనుభవం అత్యుత్తమమైన సీనియర్, అనుభవజ్ఞులైన వైద్యులతో సేవలు అందిస్తామని తెలిపారు. వాసన్ చందానగర్ ఇన్‌చార్జి, చీఫ్ సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ రతన్‌కుమార్ మాట్లాడుతూ.కంటికి సంబంధించిన సంక్లిష్టమైన, నయం చేయలేని అన్ని వ్యాధులను ఈ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రిలో వైద్యులు గుర్తించి చికిత్స చేస్తారన్నారు. కంటికి సంబంధించిన అన్ని వ్యాధులను, ఒకే గోడు కింద గుర్తించి చికిత్స అందించనున్నారు. కంటి శుక్లాం, లాసిక్, రెటినోపతి, అక్యులో ప్లాస్టి, కార్నియా, మెల్లకన్ను, పీడియాట్రిక్ ఆప్తమాలజీ వంటి, న్యూరో ఆప్తమాలజీ, ఆస్పత్రిలో సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వాసన్ఐకేర్ నెట్ వర్క్ దేశంలో కంటి సంరక్షణ ఆస్పత్రికిసంబంధించిన, ప్రధాన సంస్థ ఇది హమ్ హై హమేషా ఆప్ కే లియే, వంటి ప్రచారం నుండి భారతదేశంలో ప్రతి సంవత్సరం 6 మిలియన్లకు పైగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

రాజకీయాలను తాకిన బెట్టింగ్ ఫీవర్

- ప్రధాన అభ్యర్థులపై పందెం
- ఉత్కంఠ రేపుతున్న కొడంగల్ నియోజకవర్గంపై పందెం
- రూ.2 వేల నుంచి మొదలుకొని లక్షల్లో ..
- కొడంగల్ నియోజకవర్గం ఎన్నికపై పందెం కాసేందుకు ఎక్కువగా ఆసక్తి
- నగదుతో మరికొందరు చెక్కులు, కాగితాలపై రాసుకొని పందెం కాస్తున్న వైనం





నవతెలంగాణ-పరిగి

భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ జరిగేటప్పుడు, ఐపీఎల్ మ్యాచ్లు జరిగేటప్పుడు, ప్రో కబడ్డీ మ్యాచ్లు జరిగే టప్పుడు ఎవరు గెలుస్తారనే దానిపై జోరుగా బెట్టింగ్ కొనసాగేది. ఈ బెట్టింగ్ ఫీవర్ ఇప్పుడు రాజకీయాలనూ తాకింది. ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయినప్పటినుండి పందెం రాయుళ్లు జోరుగా బెట్టింగ్ కాస్తున్నారు. ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తు న్నాడని, లేదు ప్రత్యర్థి గెలుస్తున్నారు అంటూ పందెం కాస్తున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. ఏ పార్టీకి అత్యధిక స్థానాలు రాబోతున్నాయనే అంశాలపై పందెం కడుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో ఉన్న ప్రధాన అభ్యర్థులపై, ఉత్కంఠను రేపుతున్న నియోజకవర్గాలలోని అభ్యర్థుల పై పందెం కాస్తున్నారు.

ముఖ్యంగా జిల్లాలోని తాండూర్, కొడంగల్, పరిగి, వికారాబాద్‌లో ఎవరు గెలుస్తారనే దానిపై జోరుగా బెట్టింగ్ కాస్తున్నరు. ఈ బెట్టింగ్‌లో యువత నుండి పెద్దవారి వరకు పాల్గొంటున్నారు. ముఖ్యంగా యువత ఈ బెట్టింగ్‌లో అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్టు సమాచారం. రూ.2 వేల నుంచి మొదలుకొని లక్షల్లో పందెం కాస్తున్నారు. ఫలితాలకు ఇంకొన్ని గంటలే మిగిలి ఉండడంతో ఈ బెట్టింగ్ జోరందుకుంది.

ఎవరిపై పందెం కాస్తున్నారు అంటే..

వికారాబాద్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో బరిలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులపై బెట్టింగ్ కాస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కొడంగల్ నియోజకవర్గం ఎన్నికపై పందెం కాసేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. కొడంగల్‌లోని కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ అధ్యక్షుడు రేవవత్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిపై భారీ మొత్తంలో పందెం కాస్తున్నారు. తాండూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్ రెడ్డిపై, కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్ రెడ్డిపై, పరిగి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డిపై, వికారాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్, బీఆర్ఎస్ అభ్యర్థి మెతుకు ఆనంద్‌పై బెట్టింగ్ కడుతున్నారని సమాచారం.

నేరుగానే బెట్టింగ్

ఎవరు గెలుస్తారనే దానిపై నేరుగా బెట్టింగ్ కాస్తున్నారు. బెట్టింగ్ కట్టే ముందు అభ్యర్థులపై అంచనాలు వేసుకుని దానిని బట్టి బెట్టింగ్ కాస్తున్నారు. ముఖ్యంగా ఏ అభ్యర్థి గెలుస్తాడు ఎంత మెజార్టీతో గెలుస్తున్నారనే దానిపై వందెం కాస్తున్నారు. ఈ బెట్టింగ్‌లో నేరుగా నగదుతో పందెం కాస్తున్నారు. మరికొందరు చెక్కులు, కాగితాలపై రాసుకొని పందెం కాస్తున్నారు. మరికొందరు బెట్టింగ్ రూ.1,000 కి రూ.2 వేలు ఇస్తామని చెప్పి పందెం కాస్తున్నారని సమాచారం.

సర్వేలతో మరింత జోరుగా

జాతీయస్థాయి సమస్థల, రాష్ట్రస్థాయి సంస్థల ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా రాగా మరికొన్ని సంస్థలు హంగు ఏర్పడతాయని, మరికొన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్ బీఆర్ఎస్‌కు అనుకూలంగా రావడంతో స్పష్టమైన మెజార్టీ ఎవరికి వస్తుందా అనే దానిపై అంచనాలు పెరిగాయి. దీనితో బెట్టింగ్ మరింత రసవత్తరంగా మారింది. ఫలితాల సమయం దగ్గర పడుతున్న కొద్దీ పందెం కాసేవాళ్లు మరింతగా రెచ్చిపోతున్నట్టు సమాచారం. ఫలితాల గడువు కొన్ని గంటలే ఉండడంతో బెట్టింగ్ జోరు ఎంతమందిని ముంచుతుందో, ఎంతమందిని గట్టెక్కిస్తుందో చూడాలి మరి.

సేద తీరుతున్న నాయకులు





నవతెలంగాణ-పరిగి

శాసనసభ ఎన్నికల సందర్భంగా 50 రోజులుగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు నిత్యం ప్రచారంలో మునిగితేలారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు నిలకడ లేకుండా పనిచేశారు. గురువారం ఓటరులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించేంత వరకూ విరామం లేకుండా శ్రమించిన ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులు గెలుపుపై దృష్టి పెట్టారు. గురువారం పోలింగ్ మోయడంతో శుక్రవారం అభ్యర్థులు తమ నివాసాల్లో సేద తీరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేష్ రెడ్డి తన నివాసాల్లో పత్రికలు తిరగవేస్తూ ప్రశాంతంగా కూర్చున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టి రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమారెడ్డితో కలిసి తన నివాసంలో పత్రికను చదువుతూ న్యూస్ ఛానల్‌ను తిలకిస్తూ కనిపించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ భూనేటి తన నివాసంలోని వరండాలో వాకింగ్ చేస్తూ కనిపించారు.



కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-హయత్‌నగర్

వ్యాధిని ద్వేషించండి,వ్యాధిగ్రస్తులను కాదు అని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవి/ఎయిడ్స్ చుట్టూ ఉన్న నిశ్శబ్దాన్ని చెదరగొట్టడం, నిందలను తగ్గించడం, వ్యాధిగ్రస్తుల పట్ల సానుభూతి తెలిపే, మద్దతు నిచ్చే వాతావరణాన్ని పెంపొందించే లక్ష్యంతో ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్ ఒక అవగాహన నడకను నిర్వహించింది. హెచ్ఐవి / ఎయిడ్స్ అనేది ఒక సాధారణ ప్రపంచ ఆరోగ్య సవాలు. ఇది అన్ని వర్గాల వ్యక్తులను ప్రభావితం చేస్తుంది. శారీరక ఆరోగ్యానికి మించి సామాజిక, ఆర్థిక, భావోద్వేగ అంశాలకు దాని ప్రభావాన్ని విస్తరిస్తుంది. కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అవగాహన పెంచేందుకు, సంఘీభావం తెలిపేందుకు మద్దతుదారులు చేయి చేయి కలుపుతూ నడిచారు. డాక్టర్ జె. హరికిషన్, డాక్టర్ రత్నాచారి, డాక్టర్ శ్యామ్ సుందర్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రీకృష్ణ తదితరులతో సహా కామినేని హాస్పిటల్స్‌కు చెందిన జనరల్ మెడిసిన్ వైద్యులు ఈ సందర్భంగా హెచ్ఐవి / ఎయిడ్స్ పై విలువైన అవగాహనలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, ఎల్బీ నగర్‌లోని స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న వారు సానుభూతి, అవగాహన, చేకూర్పును ప్రోత్సహించే సందేశాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్స్ విభాగాధిపతి (హెచ్ఓడి), కన్సల్టెంట్ జనరల్ మెడిసిన్ డాక్టర్ స్వామి మాట్లాడుతూ 'హెచ్ఐవి/ఎయిడ్స్ పై పోరాటంలో విజ్ఞానమే మా అత్యంత శక్తివంతమైన ఆయుధం.సరైన సమాచారంతో వ్యక్తులు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవచ్చు. రెగ్యులర్ స్క్రీనింగ్‌ల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యాధి చుట్టూ ఉన్న అడ్డంకులను విచ్ఛిన్నం చేయడంలో తోడ్పడవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 38 మిలియన్ల మంది ప్రజలు హెచ్ఐవితో జీవిస్తున్నారు. ఈ సంఖ్యను తగ్గించడంలో అవగాహన మొదటి అడుగు. ఎయిడ్స్ అవేర్‌నెస్ వాక్ వంటి కార్యక్రమాలు అపోహలను తొలగించడమే కాకుండా అవగాహన, కరుణను పెంపొందిస్తాయి. మనమంతా కలిసి, హెచ్ఐవీ / ఎయిడ్స్ ప్రభావం నుండి తమను, తమ కమ్యూనిటీలను రక్షించుకోవడానికి మనం వ్యక్తులను శక్తివంతం చేయవచ్చు" అని అన్నారు. కేఏఎంఎస్ఆర్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. అంజయ్య మాట్లాడుతూ, "ఐక్యత బలం,అవగాహన శక్తిని పురస్కరించుకుని, మా ఎయిడ్స్ దినోత్సవ అవగాహన నడక ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు మార్గాన్ని ప్రకాశవంతం చేసింది. మనం కలిసి ముందుకు సాగుతున్నప్పుడు, హెచ్ఐవి / ఎయిడ్స్‌కి వ్యతిరేకంగా పోరాటంలో మన గొప్ప నేస్తం జ్ఞానం అని గుర్తుంచుకోండి. ప్రతి అడుగుతో, కళంకంపై కరుణ ప్రబలంగా ఉండే ప్రపంచానికి మనం చేరువ అవుతాం. అజ్ఞానంపై అవగాహన విజయం సాధిస్తుంది. ఈ అర్థవంతమైన ప్రయాణంలో మాతో చేరినందుకు ధన్యవాదాలు" అని అన్నారు.ఎయిడ్స్ లేని ప్రపంచాన్ని సృష్టించేందుకు వారి నిబద్ధత కోసం పాల్గొనే వారందరికీ, మద్దతు దారులకు, ఈ విషయంలో కలిసి పని చేస్తున్న వారందరికీ కామినేని హాస్పిటల్స్ హృదయపూర్వక కతజ్ఞతలు తెలియ జేస్తోంది. ఈ ప్రపంచ ఆరోగ్య సవాలును నిర్మూలించడంలో సహాయపడే ప్రయత్నంలో భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలకు నాయకత్వం వహించాలని కోరారు.



ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ గెలుస్తుంది



●మధు యాష్కీగౌడ్

నవతెలంగాణ -ఎల్‌బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలకు ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధు యాష్కీగౌడ్ అభినందనలు తెలియజేశారు. ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని ఆయన తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజల స్పందన బాగా ఉందని గతంలో హయత్‌నగర్, వనస్థలిపురం, బి.యన్.రెడ్డిలో కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చిందని అదే మెజార్టీ ఈ ఎన్నికల్లో కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండో స్థానం కోసం పోటీ పడుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ మద్దతు దారులు సీమాంధ్ర ఓటర్లు తనకు మద్దతు తెలిపారని ఆయన పేర్కొన్నారు. వారందరికీ కూడా అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని.. ప్రభుత్వ వ్యతిరేకత బాగా కనిపించిందని చెప్పారు. ఎల్బీనగర్ లో కూడా ప్రభుత్వ వ్యతిరేకత బాగా ఉందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకుంది అన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అదే మార్పు ఎల్బీనగర్‌లో కూడా కనిపించిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల్లో బాగా పనిచేశాయి అన్నారు. ప్రజలు 6 గ్యారంటీల స్కీములు కావాలని కోరుకుంటున్నారని ఇది ప్రచారంలో తెలిసిందని ఆయన పేర్కొన్నారు. ఎల్బీనగర్ ప్రజల ను నమ్ముకుని వచ్చిన తనకు ప్రజలు అపూర్వంగా స్వాగతించి అభినందించారని ఆయన తెలిపారు. ఎల్బీనగర్ గెలుపులో తాను ఎల్బీనగర్ ప్రజలను చూసుకుంటున్నానని తెలిపారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎల్బీనగర్ లో కూడా అదే అభివృద్ధి కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎల్బీనగర్ ప్రజలకు అభినందనలు తెలియజేశారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి

నవతెలంగాణ-సంతోష్ నగర్

బీజేపీ మలక్ పేట్ ఎమ్మెల్యే అభ్యర్థి సంరెడ్డి సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వారణాసి కాశి విశ్వనాథ ఆలయ కాలభైరవ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్టుగా సురేందర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం నిర్వహించిన స్వామివారి పాలాభిషేకం ప్రత్యేక పూజలు రాష్ట్ర ప్రజలను కాపాడుతుందని తెలిపారు. ఆలయ అభివృద్ధి భక్తుల సహకారంతో జరుగుతుందన్నారు. స్వామివారి ఆశీర్వాదంతో నిత్యం పూజ పునస్కారాలు జరుగుతునే ఉంటాయన్నారు. అనంతరం స్థానిక భక్తులు వారికి ఆహ్వానం పలుకుతూ వేదమంత్రోచ్చా రణలతో పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్‌బీ నగర్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుంది

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్‌బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని బీఆర్ఎస్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవీ రెడ్డిసుధీర్ రెడ్డి తెలిపారు. ఎంతమంది ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ఎల్బీనగర్‌లో గులాబీ జెండా ఎగురుతుందని పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పైన అవగాహన లేని రాజకీయ నాయకులు ఎల్బీనగర్‌లో పోటీ చేసి ఎంతోకాలంగా తాను నిర్వహిస్తున్న మార్నింగ్ వాకింగ్‌ను కూడా ఎగతాళి చేశారని విమర్శించారు. బీజేపీ నాయకులు ఎన్ని ఆరోపణలు చేసినా ఎన్నికల్లో ఆ పార్టీకి మూడో స్థానమే దక్కుతుందని తెలిపారు. ఎల్బీనగర్ ప్రజలు అభివృద్ధివైపే ముగ్గు చూపారని, బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్ట బోతున్నారని తెలిపారు. ఎల్బీనగర్ నియోజక వర్గం అభివృద్ధికి తాను నిరంతరం శ్రమించానని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినందుకు అధికారులను, ప్రజలను ఆయన అభినందించారు. ఎల్బీనగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీ సీ, ఓసీ అన్ని వర్గాల ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నందుకు అభినందనలు తెలియజేశారు. కొంత మంది వ్యక్తిగతంగా తనపై కరపత్రాలు వేసి తన ప్రతిష్టను దెబ్బ తీశారని అన్నారు. అయితే ప్రజలు వాటిని పట్టించుకోలేదని తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థి దేవి రెడ్డి సుధీర్ రెడ్డికి బకెట్ గుర్తు వస్తే దానిని ముందు వరుసలో పెట్టి తనను ఓడించడానికి కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. తనపైన అనేక మంది అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయంగా లబ్ధి పొందడానికి ప్రయత్నించారని, ప్రజలు వాటిని తిరస్కరించారని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల ఇండ్లలో పోలీసులు తనిఖీ చేస్తే దానిని సుధీర్ రెడ్డి తనిఖీ చేయించారని అసత్య ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అడ్డంకులనుఎదుర్కొని ఎమ్మెల్యేగా గెలుస్తున్నానని, ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని సుధీర్ రెడ్డి తెలిపారు. ఓటింగ్‌లో పాల్గొన్న ఎల్బీనగర్ ప్రజలకు సుధీర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.



మధుయాష్కి గౌడ్‌కు ఓట్లు వేసిన వారికి ధన్యవాదాలు

● సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్

నవతెలంగాణ-సంతోష్ నగర్

కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కి గౌడ్‌కు గెలుపు దిశగా భారీ మెజార్టీతో ఓట్లు వేసిన కార్యకర్తలు, సభ్యులకు పార్టీ ఎల్బీనగర్ సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్ అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించిన, సహకరించిన నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గడచిన పదేండ్లుగా అడుగడుగునా అణచివేతలు, దాడులు, కేసులకు వెరవకుండా కాంగ్రెస్ చేసిన పోరాటంలో ప్రజల పక్షాన నిటారుగా నికార్సుగా నిలబడ్డారు అని పేర్కొన్నారు.



జంతుశాస్త్ర విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్.ఎస్.ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో

ఎయిడ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-హయత్ నగర్

ప్రపంచ ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాన్ని హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ . కె . జ్యోత్స్న ప్రభ అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఎయిడ్స్ వ్యాధి అనునది హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్ అను రోగనిరోధక వ్యవస్థపై దాడి చేసే వైరస్ వలన సోకుతుందని, దీనివల్ల శరీరానికి అంటువ్యాధులు, రోగాలతో పోరాడే శక్తి తగ్గుతుందన్నారు. ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. అందువల్ల ఎయిడ్స్‌పట్ల అవగాహన పెంచుకుని దాని నివారణకు కృషి చేయడం ప్రతీ ఒక్కరి సామా జిక బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ సరైన ఆహారపు అలవాట్లను కలిగి శారీరక శ్రమతో మానసిక ప్రశాంతతను కూడా కలిగి ఉండా లన్నారు. జంతుశాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి మానవుని రోగ నిరోధక వ్యవస్థ, ఎయిడ్స్ వ్యాధి పుట్టుక, విస్తరణ, వ్యాపించే విధానాలు, నివారణ మార్గాలను గూర్చి వివరించారు. కళాశాల ఆంగ్ల అధ్యాపకులు శ్రీ .పి విద్యాసాగర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ వాడకం వంటి దుర్వ్యసనాల వల్ల ఎయిడ్స్ వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఎన్.ఎస్. ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాజేష్ భవాని సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్. కె . సురేష్ రెడ్డి అధ్యాపకులు యం. చెన్నోజి,ఎన్ . ఎస్ . ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరా బాద్ లోని వారి నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి కలిసి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల సరళి, ఇతరత్రా విషయాలు చర్చించారు.

నవతెలంగాణ-ఎల్‌బీనగర్



నవతెలంగాణ

ఓటర్లకు కృతజ్ఞతలు

- ప్రకాష్ గౌడ్ గెలుపు ఖాయం
- నార్సింగి బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్



నవతెలంగాణ-గండిపేట్

నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి ఓటర్స్ ఓటు హక్కును వినియోగించుకున్నందుకు బీఆర్ఎస్ నార్సింగ్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు వర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీలోని వట్టినాగులపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ రాదన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముచ్చటగా నాలుగోసారి ఎమ్మెల్యే గెలుపు ఖాయం అన్నారు.



మూడవసారి బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి

నవతెలంగాణ-గండిపేట్

రాష్ట్రంలో మూడవసారి బీఆర్ఎస్ గెలుపు ఖాయమని కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ గండిపేటలోని తుల్జా భవాని మాతాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గెలుపు ఖాయమన్నారు. రేపు నిర్వహించే ఓటింగ్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి ప్రకాష్‌గౌడ్ గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్ రాదన్నారు. గత పది సంవత్సరాల కాలం నుండి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వస్తే అభివృద్ధికి దూరంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ వస్తే ఆ పార్టీ నాయకులే ఒకరినొకరు తన్నుకుంటారన్నారు. ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తారన్నారు. అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడతారని ఆరోపించారు. మూడవసారి ముచ్చటగా కెసిఆర్ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల గణేష్ కుమార్, కౌన్సిలర్ ప్రవీణ్ కుమార్, నార్సింగి మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు రామేశ్వరం విశ్వనాథ్, నాయకులు సునీల్ కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ గడ్డపైన ప్రకాష్‌గౌడ్‌కు తిరుగులేదు

- బండ్లగూడ కార్పొరేటర్ బుర్ర భూపాల్ గౌడ్



నవతెలంగాణ-గండిపేట్

రాజేంద్రనగర్ నియోజకవర్గం గడ్డపైన ప్రకాష్‌గౌడ్‌కు తిరుగులేదని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ బుర్ర భూపాల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నాల్గోసారి ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే గా విజయం ఖాయమన్నారు. గత పది సంవత్సరాల నుంచి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ గెలుపొందిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామన్నారు. రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపునకు సర్వేలు సైతం అనుకూలంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ బీజేపీ ఎంఐఎం పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్రంలో మరోసారి కేసీఆర్ సర్కార్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భారతీయ మత్తు వైద్యుల సంఘం జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన డా. రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-చేవెళ్ల



ఇటీవల జరిగిన మత్తు వైద్యుల సంఘం జాతీయ ఎన్నికల్లో భారీ మెజారిటీ తోడ ముదిగంటి రామకృష్ణారెడ్డి గవర్నింగ్ కౌన్సిల్ మెంబెర్‌గా విజయం సాధించారు. ఆయన ప్రస్తుతం పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ మెడికల్ సూపెరింటెంట్, అనేస్తేషియా ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. గతంలో డా. రామకృష్ణ రెడ్డి తెలంగాణ స్టేట్ సెక్రటరీగా సేవలందించారు. ఆయన భారతీయ మత్తు వైద్యుల సంఘం జాతీయ ప్రొఫైసైన్సీ అవార్డును అందుకున్నారు.





‘ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి’

నవతెలంగాణ-చేవెళ్ల

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల మెడికల్ సూపరిండెంట్ డా.రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అన్నారు. ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి అయినప్పటికీ పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సూచన మేరకు మందులు వాడితే జీవిత కాలాన్ని పెంచవచ్చని తెలిపారు. వ్యాధిగ్రస్తులను చీదరించుకోవడం, వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం నేరమని తెలిపారు. ఎయిడ్స్ రోగుల చికిత్స కోసం తమ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యాధి గ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల అపోహలు వద్దని, అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడి డా. అశోక్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వర్ రావు, డా.పవిత్ర, డా. విష్ణు తదితరులు పాల్గొన్నారు.

‘టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి’



నవతెలంగాణ-చేవెళ్ల

తెదేపా బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలో మండలాధ్యక్షుడు పాటి మల్లారెడ్డి ఆధ్వర్యంలో దేవుని ఎర్రవల్లి గ్రామ కమిటీ వేశారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించి, టీడీపీ తెలంగాణలో అభివృద్ధి చెందాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ మారకుండా, క్రమశిక్షణతో టీడీపీ పార్టీలో కొనసాగుతున్నందున వారిని అభినందించారు. చేవెళ్ల నియోజకవర్గంలో అన్ని మండలాల్లో గ్రామ కమిటీల నిర్మాణం నూతనంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా మాణిక్యం ఎన్నిక

చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా దండ మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా శివరాజు లేను ఎన్నుకున్నారు. సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కాసుల సుభాన్‌గౌడ్, యాదయ్యగౌడ్, మోయినాబాద్ అధ్యక్షుడు మాణిక్యం, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.కృష్ణ, బీసీ సెల్ అధ్యక్షులు మాణిక్యరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు

నవతెలంగాణ-షాబాద్

రెండు రోజుల నుంచి ఉదయం పొగ మంచు కమ్ముకుంటోంది. దీంతో శుక్రవారం ఉదయం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు ఉండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని వెలుతున్నారు. పొగ మంచు కారణంగా వాహనదారులు వాహనాలను చాలా జాగ్రత్తగా నడపాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ సూచించారు.





కార్యకర్తలకు అండగా ఉంటా

- చేయూతనిచ్చినందుకు చేతులెత్తి మొక్కిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్

నవతెలంగాణ-షాబాద్

కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా పనిచేసినందుకు అందరికి అండగా ఉంటానని కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డిలతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకన్న బిడ్డలా చేరదీసినందుకు ప్రతి ఒక్కరికి చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించి, అభిమానించి రేయింబవళ్లు కష్టపడి పనిచేసినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో తనతో పాటే సైనికుల్లా సేవలందించిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలివీస్తుందని, సర్వేలు కూడా కాంగ్రెస్ పార్టీకి శుభసూచికం చూపిస్తున్నాయని అన్నారు. పార్టీ నాయకులతో పాటు అన్ని విభాగాల కార్యకర్తలకు, ఎన్నికల్లో భాగా పనిచేసిన వారందరికి మంచి భవిషత్తు ఉంటుందని. అన్నారు. ప్రతి కార్యకర్తకు ఏ అవసరం



వచ్చిన అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండలాధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, ఎంపీటీసీ మల్లేష్, నాయకులు రాఘవరెడ్డి, తమ్మలి రవీందర్, ఆక్తర్పాష, పీసరి వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, పెంటారెడ్డి, పామెన నర్సింహులు, చెన్నయ్య, రమేష్, రాజు, గౌతం మాజీ సర్పంచులు యాదగిరి, బుచ్చయ్య సత్యనారాయణ, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.